క్లుప్తంగా

సీఎం బస్సుయాత్ర విజయవంతం


ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా శనివారం గుత్తిలో సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన రోడ్ షో విజయవంతమైందని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. రోడ్‌షోకు నియోజకవర్గం నుంచి వేలాదిగా తరలివచ్చి వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు తామంతా సిద్ధమని చాటిచెప్పిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, వైఎస్సార్ అభిమానులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని ఆయన కోరారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం


నరసాపురంలో ప్రచారం చేస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్ రెడ్డి

పెద్దపప్పూరు: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని నరసాపురం చేనేత కాలనీలో ఆదివారం ఆయన పర్యటించారు. నేత కార్మికులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న మళ్లీ సీఎం అయితే మరిన్ని సంక్షేమ పథకాలు అమలవడంతోపాటు రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి, ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తిరెడ్డి, నాయకులు రామాంజుల రెడ్డి, రామచంద్ర, నామనాంకపల్లి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

6న బియ్యం, బేడల వేలం

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా భక్తులు స్వామికి సమర్పించి బియ్యం, బేడలను ఈనెల 6న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు


శింగరబట్టు, గణపతి, అశ్వర్థనారాయణుడు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థ క్షేత్రంలో ఆదివారం శింగరబట్టు, గణపతి, నారాయణస్వామికి అర్చకులు సుధీర్‌కుమార్ శర్మ, సునీల్ కుమార్ శర్మ, బాలసుబ్రమణ్యశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులకు ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రమణ్యం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వాహనాల తనిఖీ

గార్లదిన్నె: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గార్లదిన్నె పోలీసులు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. ఆదివారం సాయంత్రం మండలంలోని తలగాచిపల్లి క్రాస్‌లో 44వ జాతీయ రహదారిపై వై జంక్షన్ వద్ద పోలీసులు ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు. ఏఎస్ఐ గురుమూర్తి మాట్లాడుతూ వాహనదారులు తనిఖీకి సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ వెంట ఉంచుకోవాలన్నారు. వాహనాల్లో డబ్బు తరలిస్తే.. అందుకు సంబంధించి ఆధారాలు చూపాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టండి


ముకుందాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

- ఎంపీ ఎమ్మెల్యే అభ్యర్థులు శంకరనారాయణ, వీరాంజనేయులు
- ముకుందాపురం, యర్రగుంట్ల, కేకే తండా,కొట్టాలపల్లి, కమలాపురంలో ఎన్నికల ప్రచారం


కమలాపురంలో పల్లె నిద్ర చేస్తున్న వీరాంజనేయులు

గార్లదిన్నె: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఐదు సంవత్సరాల్లో ప్రజలందరికీ మంచి చేసిందని, వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, అనంతపురం పార్లమెంట్ అభ్యర్థి శంకరనారాయణ కోరారు. ఆదివారం మండలంలోని ముకుందాపురం, యర్రగుంట్ల, కేకే తండా, కొట్టాలపల్లి, కమలాపురం గ్రామాల్లో 'మన ఊరికి మన వీరా' కార్యక్రమంలో భాగంగా పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరాంజనేయులు, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసుతో కలసి వారు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారికి ప్రతి గ్రామంలో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు, వలంటీర్,గ్రామ సచివాలయం వ్యవస్థ మళ్లీ కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. బాగా ఆలోచించి అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేయాలని సూచించారు సంక్షేమ పథకాలతో లక్షలాది మంది పేదల జీవితాల్లో సీఎం జగన్ వెలుగులు నింపారన్నారు. 2014 నుంచి 2019 వరకూ చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసింది శూన్యమన్నారు.

'టిప్పర్ డ్రైవర్' రేపు అసెంబ్లీలో అడుగుపెడతాడు


యర్రగుంట్లలో మాట్లాడుతున్న వీరాంజనేయులు

గార్లదిన్నె: టీడీపీ అధినేత చంద్రబాబు ఎగతాళి చేసిన టిప్పర్ డ్రైవర్ ప్రజలందరి ఆశీర్వాదంతో రేపు అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నాడని శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు అన్నారు. ఆదివారం ప్రచారంలో భాగంగా యర్రగుంట్లలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇటీవల బుక్కరాయసముద్రం బహిరంగ సభలో నన్ను టిప్పర్ డ్రైవర్ అని హేళనగా మాట్లాడడంతో సోషల్ మీడియా, టీవీలు,న్యూస్ పేపర్లలో అన్ని వర్గాల ప్రజలూ నాకు మద్దతూ ఇస్తున్నారన్నారు. ఒక అబద్ధాన్ని వంద సార్లు చెబితే అది నిజం అవుతుందనే పాత పద్ధతి నుంచి టీడీపీ నాయకులు బయటపడితే మంచిదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురించి టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి మాట్లాడడం సరికాదన్నారు. ఆలూరు సాంబశివారెడ్డి విషయంలో కూడా అర్థం లేని ఆరోపణలు చేశారన్నారు. ఇప్పటికే ఒక తప్పు చేసి జనాల్లో చులకనయ్యారన్నారు. బండారు శ్రావణి భ్రమలో ఉన్నారు. ఇటీవల చంద్రబాబు నా గురించి వంద రెట్లు ప్రచారం చేసి వెళ్లారన్నారు. నేను గెలవాలని రాష్ట్రంలోని డ్రైవర్లు, పేదవాళ్లు, ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని గతంలో చంద్రబాబు మాట్లాడితే మీరు వెనకేసుకొస్తున్నారన్నారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ,నా మైనార్టీ అని అణగారిన వర్గాల ప్రజలను అగ్రస్థానానికి తీసుకెళ్లిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. శింగనమల నియోజకవర్గ ప్రజలు ఖచ్చితంగా అత్యధిక మెజార్టీతో గెలిపించి నన్ను అసెంబ్లీకి పంపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అలాగే టీడీపీ ప్రభుత్వంలో పేదల కోసం ప్రవేశపెట్టామని చెప్పుకోవడానికి ఒక్క సంక్షేమ పథకం కూడా లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కొనే సత్తా లేక ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకుని మరోసారి ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ ప్రయత్నిస్తోందన్నా రు. చంద్రబాబు ఎంత మందితో పొత్తులు పెట్టుకున్నా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అనంతరం కమలాపురంలో రాత్రికి ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు పల్లె నిద్ర చేసి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, పాలిఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరంధామ, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, యర్రగుంట్ల సర్పంచు శాంతప్ప, ముకుందాపురం సర్పంచు హిమకుమారి, మాజీ సర్పంచు హనుమంతరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వీరా ప్రచారం

శింగనమల: మన ఊరికి-మన వీరా కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు సోమవారం శింగనమల మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలక్రిష్ణ ఆదివారం తెలిపారు. ఉదయం 7.30 గంటలకు గురుగుంట్ల, వెస్ట్ నరసాపురం, చిన్నజలాలపురం, శివపురం, సీ.బండమీదపల్లి , పోతురాజుకాల్వ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

దళితులు, పేదలంటే చంద్రబాబుకు చిన్నచూపు

యాడికి: చంద్రబాబుకు మొదటి నుంచి దళితులన్నా, పేదలన్నా చిన్నచూపని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు ఆది అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంఏబీఈడీ చదివి కుటుంబ పోషణ కోసం టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న వీరాంజనేయుల నీతి, నిజాయతీ, కష్ట పడే తత్వం, సేవాతత్పరతను మెచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థిగా నియమించారన్నారు. అటువంటి వీరాంజనేయులును కించపరుస్తూ ఇటీవల ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతామన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

గుత్తి: పట్టణంలోని కాల్వగడ్డ ఆంజనేయస్వామి దేవాలయం ఏరియాలో నివాసముండే బేల్దారి కరీంకు చెందిన ద్విచక్ర వాహనం అపహరణకు గురైంది. కరీం శనివారం రాత్రి పది గంటల సమయంలో ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేశాడు. ఉదయం లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జేసీ సోదరులను నమ్మే పరిస్థితి లేదు



చుక్కలూరులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, తాడిపత్రి పట్టణంలోని బుగ్గయ్యకాలనీలో మహిళను ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

- తాడిపత్రిలో మారోసారి వైఎస్సార్‌సీపీ జండా ఎగురుతుంది
- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: అక్రమాలు, అరాచకాలకు కేరాఫ్‌గా మారిన జేసీ సోదరులను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, తాడిపత్రిలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా తప్పక ఎగురుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని చుక్కలూరు గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు శాలువాలు, పూలహారాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు కలసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించాలన్నారు. చంద్రబాబు బూటకపు హామీలను నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. చంద్రబాబు హయాంలో 600 హామీలిచ్చి ఒక్క పథకాన్ని కూడా సరిగా అమలు చేయలేదన్నారు. సంక్షేమ పథకాల అమలు సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, మండల కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, నాయకులు ఆలూరు రామేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, హరీష్‌రెడ్డి, విశ్వనాథ్, శ్రీరంగ, భాస్కర్, ప్రసాద్‌రెడ్డి, ఆచారి, రాజారాం, సుధీర్, చంద్ర, సుధాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, హనుమంతరెడ్డి, రవి, భాషా, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బుగ్గయ్య కాలనీలో..

తాడిపత్రిరూరల్: పట్టణంలోని బుగ్గయ్య కాలనీలో ఆదివారం ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ నాయకుల మాయ మాటలకు మోసపోకుండా, అభివృద్ధిని చూసి ఓటు వేయాలన్నారు. గతంలో టీడీపీ నాయకుల అక్రమాలు, దౌర్జన్యాల వల్ల తాడిపత్రిలో అశాంతి వాతావరణం ఉండేదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే వాటికి చరమగీతం పాడానన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు ఓటు వేసి మోసపోయారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి.. చేసిన తప్పును సరిదిద్దుకోవాలని ప్రజలను కోరారు.

అవ్వతాతలు, దివ్యాంగులే 'బాబు'కు బుద్ధి చెబుతారు


ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి రూరల్: అవ్వతాతలు, దివ్యాంగులకు వలంటీర్లు పింఛన్ ఇవ్వకుండా అడ్డుకున్న చంద్రబాబుకు.. వచ్చే ఎన్నికల్లో వారే బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. వలంటీర్లు పెన్షన్ల పంపిణీ పేరుతో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తారంటూ పచ్చ బ్యాచ్‌కు చెందిన నిమ్మగడ్డతో ఎన్నికల సంఘానికి చంద్రబాబు ఫిర్యాదు చేయించాడన్నారు. దీంతో రాష్ట్రంలో దాదాపు 60 లక్షల మందికి పైగా పెన్షనర్లకు వలంటీర్లు పంపిణీ చేయలేని పరిస్థితి అన్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయల ద్వారా పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశాలు వచ్చాయన్నారు. నడవలేని, మంచానపడ్డ వృద్ధులు, అనారోగ్య కారణాల వల్ల ఇబ్బందులు పడుతున్న వారు, దివ్యాంగుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మొదటి నుంచి చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ వలంటీర్లపై విషం కక్కుతున్నారన్నారు. వారిని అసాంఘిక శక్తులతో పోల్చుతూ కక్ష తీర్చుకుంటున్నారన్నారు. టీడీపీ, జనసేన నాయకుల తీరుతో విసుగు చెందిన వలంటీర్లు మనస్తాపానికి గురవుతున్నారన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయంతో తాడిపత్రి ప్రాంతంలో ఎక్కువ మంది వలంటీర్లు రాజీనామా చేయనున్నారన్నారు. వలంటీర్లపై అసత్య ఆరోపణలు చేస్తూ వారిపై ఎన్నికల సంఘానికి టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడం వల్ల పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారన్నారు. టీడీపీ అండ్‌కో ఎన్ని గిమ్మిక్కులు చేసిన వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పి ఘోరంగా ఓడిస్తారన్నారు. తాడిపత్రిలో సైతం టీడీపీ నాయకుల అగడాలు పెరిగిపోతున్నాయన్నారు. ధర్నాల పేరుతో ప్రశాంతంగా ఉన్నా గ్రామాల్లో చిచ్చు రేపడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కొత్తగా పార్టీలో చేరిన ఇరువురు బిల్లుల కోసం అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేసేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున జనాలతో శాంతిభద్రలకు భంగం కలిగించి పబ్లిసిటీ పొందాలని ప్రయత్నం చేశారన్నారు. ధర్నాకు ప్రయత్నిస్తే కేసులు పెడుతామని పోలీసులు హెచ్చరించడంతో తోకముడిచారన్నారు.

వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు కక్షగట్టారు


మాట్లాడుతున్న రామలింగప్ప

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు కూటమి కక్ష గట్టిందని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.రామలింగప్ప, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప మండిపడ్డారు. ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు తొత్తుగా వ్యవహరిస్తున్న నిమ్మగడ్డ రమేష్ సారథ్యంలో నడుస్తున్న సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ చేత వలంటీర్లపై ఈసీకి ఫిర్యాదు చేయించి పింఛన్ల పంపిణీని అడ్డుకునే ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. చంద్రబాబు, ఎల్లోబ్యాచ్ కుట్రల కారణంగా వలంటీర్ల విధులపై ఈసీ తీసుకున్న నిర్ణయం వల్ల ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ తీసుకునే 66.40 లక్షల మంది అవ్వాతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వితర లబ్ధిదారులు ఇబ్బంది పడతారన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాకుండానే ఇంటింటికీ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎత్తివేయించారని, ప్రజలు పొరపాటున ఓటేస్తే రానున్న రోజుల్లో సంక్షేమ పథకాలను కూడా రద్దు చేస్తాడన్నారు. వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి జన్మభూమి కమిటీలను పెట్టాలని చంద్రబాబు చూస్తున్నాడన్నారు. చంద్రబాబు దుర్మార్గపు బుద్ధికి మీ విలువైన ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మార్కెట్ వెంకటేష్, ప్రతాప్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బుక్కరాయసముద్రం: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమన్నారు. ఎలాంటి గొడవలకు పాల్పడరాదన్నారు. అనవసరంగా ఎవరైగా రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా చర్యలు తప్పవన్నారు. నిబంధనలకు కట్టుబడి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రెండు హోటళ్లలో చోరీ

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో గోల్డెన్ కేఫ్(హోటల్), టీ టైమ్ హోటళ్లలో శనివారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు కేఫ్‌లలోకి ప్రవేశించి సుమారు రూ. 25 వేలు విలువైన సిగరెట్లు ఎత్తుకెళ్లారు. అంతే కాకుండా కొంత నగదు కూడా చోరీ చేశారు. ఈ ఘటనలపై బాధితులు రఫీ, బాషా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటరామిరెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

గార్లదిన్నె: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ అర్హులైన విద్యార్థులు మే 22 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. పదో తరగతిలో మార్కులు, రిజర్వేషన్లు ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు.

నేడు వసతి గదుల నిర్వహణకు వేలం

తాడిపత్రి టౌన్: మండలంలోని గంగాదేవిపల్లి సమీపంలో ఉన్న గంగాభవానీ ఆలయంలో సోమవారం వసతి గదుల నిర్వహణ కోసం వేలం నిర్వహించనున్నట్లు ఈఓ సుబ్రమణ్యం ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు


గుత్తి బైబిల్ మిషన్ చర్చిలో ఈస్టర్ ప్రార్థనలకు భారీగా హాజరైన క్రైస్తవులు

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని అన్ని చర్చిలు ఏసు నామస్మరణలతో మార్మోగాయి. గుత్తిలోని బైబిల్ మిషన్ చర్చి(స్వస్థత శాల), సీఎస్ఐ టౌన్ చర్చి, ఆర్ఎస్ సీఎస్ఐ చర్చి, హోరబ్ చర్చిలో ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ అద్భుత కుమార్, మణి కుమారి, పాస్టర్లు జోసఫ్, సాల్మన్ తదితరులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈస్టర్ యొక్క ప్రాధాన్యతను, విశిష్టతను వివరించారు. ఏసయ్య మరణించి పునర్జన్మించిన రోజే ఈస్టర్ అన్నారు. ఈ సందర్భంగా చర్చిలు క్రైస్తవులతో కిక్కిరిసిపోయాయి.

పామిడి: మండలంలోని అన్ని చర్చిల్లో క్రైస్తవులు ఈస్టర్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని పెద్దవడుగూరు, దిమ్మగుడి, గుత్తిఅనంతపురం , చిన్నవడుగూరు తదితర గ్రామాల్లోని చర్చిల్లో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇమ్మానియేల్, ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లోని చర్చీల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ వేడుకలు నిర్వహించారు.ఈసందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ ఏసు పట్ల విశ్వాసం కలిగిన వారందరికీ అనుగ్రహం ఉంటుందన్నారు.


పెద్దవడుగూరులోని ఐఎన్ఈసీ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు


గుత్తి బైబిల్ మిషన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ రెవరెండ్ అద్భుత కుమార్, మణికుమారి


పామిడిలో ఈస్టర్ సందేశమిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్